

# బేరీ సాయం

ముద్దంశెట్టి హనుమంతరావు

శేఖరం మొహం, హఠాత్తుగ రంగుమార్చుకుంది. తను యెప్పుడూ వూహించనిది, జరుగబోతున్నందుకు నిజంగా నిశ్చేష్టుడయ్యాడు.

"నువ్వు చెబుతోంది నిజమేనా అనంతం? నేను నమ్మలేకపోతున్నాను" అన్నాడు ఆశ్చర్యంతో.

"నిజమేనండీ! స్వయంగా నేను వాళ్ళ సంభాషణ వినకపోయినా, వినిన వ్యక్తి ద్వారా సూచాయగా తెలుసుకున్నాను. ఇదేం కట్టుకథ కాదండీ" నిబ్బరంగా జవాబు చెప్పాడు అనంతం.

శేఖరం, క్షణం ఆలోచనల్లో పడ్డాడు ఎంత గట్టిగా ఆలోచించినా అతనికేమీ పాలుపోవడంలేదు. తను విన్నదే నిజంగా జరిగితే ఆ వూళ్ళో యింక అరాచకానికి లోటుండదు అనిపించిందతనికి. అటువంటి పరిస్థితి యేర్పడకుండా అరికట్టడమెలాగో. ఆలోచన ప్రారంభించింది అతని మెదడు.

శేఖరం ఆ వూళ్ళో కొత్తగా వెలసిన హైస్కూల్లో ఉపాధ్యాయుడు. అతనికి ఆ వూళ్ళో ఒక ప్రత్యేకస్థానంవుంది అందుకు ప్రత్యేకమైన కారణం బహుశా అతనికి వెంకటరెడ్డితో సన్నిహిత పరిచయం వుండటమే కావచ్చు. వెంకటరెడ్డి ఆ వూళ్లో మోతుబరి రైతు. పంచాయతీ బోర్డు ప్రెసిడెంటూను. అందుకే శేఖరంకి ఆ ప్రత్యేకత లభిస్తుందేమో!

అనంతం ప్రైమరీస్కూలు వుపాధ్యాయుడు. ఆ స్కూలు, వెంకటరెడ్డి తండ్రిగారి స్మృతిచిహ్నంగా వెలిసింది మొదట్నుంచీ అనంతం అక్కడే పని చేస్తున్నాడు. నిజం చెప్పుకోవాలంటే అతను పూర్తిగ వెంకటరెడ్డి అనుయాయుడే. అనంతంకి శేఖరంతో పరిచయం యేర్పర్చుకోవడం తప్పనిసరి అయ్యింది. వెంకటరెడ్డికి సంబంధించినంత వరకూ వీళ్ళిద్దరూ ఒకపక్షానికి చెందినవారే.

వీళ్ళిద్దర్నీ ప్రస్తుతం కలవరపరుస్తున్న విషయం యేమిటంటే వెంకటరెడ్డి దగ్గర పనిచేస్తున్న కమతగాళ్ళందరూ ఏకమై ఆయన్ని యెదిరించాలని, అవమానపర్చాలని ప్రయత్నిస్తూ వుండటమే. ఆయన కటువు ప్రవర్తన, యిటీవల ఆయన కమతగాళ్ళలో ఒకడైన రామయ్యపై చేయిచేసుకోవడం వాళ్ళ ప్రయత్నానికి హేతువయ్యాయి. ఒకవేళ వాళ్ళ ప్రయత్నమే విజయవంతమైతే, వూళ్ళో అరాచకం ప్రబలిపోదూమరి! అప్పుడు తమ పలుకుబడి, ప్రత్యేకత, దెబ్బతింటాయని వాళ్ళ భయం. ఈ స్వార్థమే, ఈ భయమే, వారిద్దర్నీ యింతగా కలవరపరుస్తోంది. ఆదుర్దా కలిగిస్తోంది. లేకపోతే వెంకటరెడ్డి యేమైపోతే వీళ్ళకేం?

"ఇంతకీ మనం చేయగలిగిందిఏమన్నా వుందా అని" శేఖరం ఆలోచనకి భంగం కలిగిస్తూ అన్నాడు అనంతం.

"ఏమీ పాలుపోవడంలేదు అనంతం. వాళ్ళ ప్రయత్నాన్ని యేదో విధంగా అరికట్టకపోతే రెడ్డిగారితోసహా మనకీ యెప్పుడో ఓసారి ముప్పురాక తప్పదు. ముప్పుమాట దేవుడెరుగు. ఇప్పుడున్న పరపతి పోతుంది." ఊళ్ళో అరాచకం పెరుగుతుంది. తను వూహించిన పరిణామాల్ని ఒక్కసారి యేకరువు పెట్టాడు శేఖరం.

అనంతం నిరుత్సాహంగా ఓనిట్టూర్పు విడిచాడు. "అదేనండీ నేనూ ఆలోచిస్తున్నాను. అయినా రెడ్డిగారు అంత కటువుగా ప్రవర్తించడంకూడా బాగోలేదు. ఎంత డబ్బున్నవాళ్ళయినా యెదుటివారి హక్కుల్ని కాపాడ్డం వాళ్ళ వ్యక్తిత్వానికి యెటువంటి ఘాతమూ తగలకుండా చూడ్డం, అవసరమంటాను." "ఆమాట గట్టిగా అనొద్దు. మనం, ఆయన్ని విమర్శిస్తున్నామని తెలిస్తే ఆయన ఆగ్రహానికి గురికావల్సివస్తుంది. రెడ్డిగారు కాల మార్పును గ్రహించడంలేదు, కాలం మారిందని కాలంతోపాటు మనుషులూ మారుతున్నారని, అర్థం చేసుకోవడం లేదు. ఏది ఏమైనా సూచాయగా మనం తెలుసుకున్న ఈ విషయాన్ని మరుగు పరిచి పీకలమీదికి తెచ్చుకోవడంకంటె వెంటనే రెడ్డిగారికి తెలియజెయ్యడం మనవిధి"

"నిజమేనండీ వుపేక్షించకూడదు. మీరోసారివెళ్ళి ఆయనతో చెప్పండి."

"అదే ఆలోచిస్తున్నాను. ఇవ్వాళే చెబుతాను" అన్నాడు శేఖరం సాలోచనగా.

అక్కడితో ఆ ప్రస్తావన ఆగిపోయింది.

* * *

ఆ రోజు సాయంత్రం యేడున్నర గంటలకి రెడ్డిగారింటికి వెళ్ళాడు. శేఖరం అతను వెళ్ళేసరికి మునసబు రంగయ్యగారు రెడ్డిగారితో మాట్లాడుతున్నారు. శేఖరంని చూడగానే కూచోమన్నట్టు సౌంజ్ఞ చేశారు రెడ్డిగారు. శేఖరం బెంచీ మీద కూలబడ్డాడు. రంగయ్యగారు యెప్పుడు వెళ్ళిపోతారా అని యెదురు చూస్తూ.

మరి కాస్సేపటికి మునసబుగారు వెళ్ళిపోయారు.

"ఆఁ....యేమిటోయ్ శేఖరం విశేషాలు" అన్నాడు వెంకటరెడ్డి. "ఇవ్వాళ చాలా నిరుత్సాహంగా కనిపిస్తున్నావే?"


శేఖరం నిర్జీవంగా ఓ నిశ్వాసం వదిలాడు.

"ఏం వుత్సాహం వుంటుందిలెద్దురూ మనుషుల్లో వస్తోన్న మార్పు చూస్తూవుంటే భయంతో గుండెలు అవిసిపోతున్నయ్" అన్నాడు యెంతో దిగులుతో.

ఆశ్చర్యపోయాడు వెంకటరెడ్డి. శేఖరం అంత దిగులుగా, నిరాశగా మాట్లాడ్డం అతను ఎప్పుడూ వినలేదు. "నీ మాటలు నాకేం అర్థం కావడం లేదోయ్ ఎవర్నిగురించి నువ్వు చెబుతున్నావు?" అన్నాడు అదోలా చూస్తూ.

"ఎవరిగురించో అయితే నాకెందుకంతీ ఝా కంగారు? కాస్త లోపలికి

# మగవాడి పాట్లు - 2




వస్తారు! ....గోడలకి చెవులుంటాయి" మెల్లగా అన్నాడు.

వెంకటరెడ్డి, ఆలోచనలో పడ్డాడు. ఏదో తనకి సంబంధించిన విషయమే అయి వుంటుందని నిర్ధారణ చేసుకున్నాడు.

"పదే పద." లేచి లోపలికి నడిచాడు. శేఖరం, ఆయన్ని అనుసరించాడు.

వాళ్ళిద్దరూ ఓ చిన్న గదిలోకి నడిచారు. ఆ గదికి చాలా ప్రాముఖ్యత వుంది. ఏ రహస్యాలోచనలు జరిగినా, ఆ గదిలోనే ఆంతరంగికులు తప్పించి, యితరులెవ్వరూ ఆ గదిలోకి అడుగు పెట్టడానికి వీల్లేదు.

"ఇప్పుడు చెప్పవోయ్ ఏమిటో!" కూచుంటూ అన్నాడు వెంకటరెడ్డి అతని మాటల్లో ఆతృత, అస్పష్టంగా ధ్వనించింది.

"మొన్నను మీరు, రామయ్యమీద చెయ్యిచేసుకున్నారు, గుర్తుందా?" ప్రారంభించాడు శేఖరం మెల్లగా.

"గుర్తులేకేం? బాగా గుర్తుంది." అన్నాడు రెడ్డి.

"అది, మీ కమతగాళ్ళందరికీ మంట పెట్టయ్యింది. అంచేతనే, వాళ్ళంతా ఏకమై, మీమీద కక్ష కడుతున్నారట. ప్రతీకారం తీర్చుకోవాలని, మిమ్మల్ని అవమాన పర్చాలని, అదనుకోసం

చూస్తున్నారటఎంత ధైర్యమోచూడండి. వాళ్ళది ...."

వెంకటరెడ్డి, ఆ మాటల్ని నమ్మలే నట్టుగా మొహంపెట్టాడు. పూటకి గతి లేని కమతగాళ్ళు తనమీద కత్తగట్టడ మేవిఁటి? ఇది ఎట్లా నమ్మడం?.... అని పించింది.

"ఏవిఁటీ ? నా మీ ద కక్ష గడు తున్నారా? నమ్మవల్సిన విషయమేనా ? లేక వాళ్ళకేమైనా మతి పోయిందా ?" తేలిగ్గా నవ్వుతూ అన్నాడు వెంకటరెడ్డి.

"ఈ విషయాన్ని అంతతేలిగ్గా తీసు కోకండి. కాలం మారుతోంది. మను షులూ మారుతున్నారు. ఇన్నాళ్ళూ అణిగి మణిగి మట్టిబొమ్మలావున్న మను షుల్లోనూ చైతన్యంవస్తోంది. ఇది నవ యుగం. ఈ యుగంలో, నిరంకుశత్వా నికి చోటులేదు. అసలు, ప్రభుత్వమే ప్రజాస్వామ్య సిద్ధాంతాలతో నడుస్తోంది. వాళ్ళంతా ఏకమై, మిమ్మల్ని ఎదిరించా రనుకోండి. ఆ పైన విజయం మాట ఎట్లాఉన్నా, అవమానభారంతో కృంగి పోవల్సిందెవరు? మీరే? వాళ్ళకేం! వాళ్ళు అన్నింటికీ తెగించినవారు. దేన్నీ లక్ష్య పెట్టరు. ఆలోచించండి బాగా...." చిన్న ఉపన్యాసం లాంటిది ఇచ్చాడు శేఖరం.

వెంకటరెడ్డి విస్తుపోయాడు. శేఖరం మాటలు అతని మెదడులో సంచలనాన్ని రేకెత్తాయి.

"అయితే, వీళ్ళందర్నీ తీసేసి,కొత్త వాళ్ళను పెట్టుకుంటే సరి !" అన్నాడు తన ధోరణిలో.

"అబ్బే! అవన్నీ పాతకాలపు పద్ధతు లండి ! ఉద్యోగాల్నుంచి యెంతమందిని తీసివేస్తే, అంతమందిని విరోధు లుగా తయారు చేసుకుంటున్నారన్న మాటే. అక్కడితో సరా ? వాళ్ళంతా కలిసి, ఓ సంఘాన్ని నెలకొల్పుతారు. వూరేగింపు ప్రారంభిస్తారు .... మీకు ప్రతికూలంగా యేవో నినాదాలుచేస్తారు. మీ యింటిముందే నుంచుని మరీ హంగామా ప్రారంభిస్తారు. అవసర మైతే, నిరాహారదీక్ష వహిస్తారు.ఎందుకు చెప్పండి యివన్నీను ?" అన్నాడు శేఖరం.

"అయితే, యేం చెయ్యమంటావు ?"

"ఒక్కటేమార్గం కనిపిస్తుంది."

"ఏవిఁటది ?" ఆసక్తి కనబర్చాడు వెంకటరెడ్డి.

"వాళ్ళని ఏదో విధంగా మంచిచేసు కుని, సఖ్యంగా మసలుకోవడం ఒక పద్ధతి."

"అబ్బే, అలా ఆయితే, వీళ్ళు మరీ నెత్తిమీదకూచుంటారోయ్. భయభక్తులు అసలేవుండవు." పెదాలు విరుస్తూ అన్నాడు, వెంకటరెడ్డి.

"అలా లాభంలేదంటే, మరోపద్ధతి వుంది. విభజన! వాళ్ళల్లో వాళ్ళకి అంతరి కలహం పరోక్షంగా కల్పించి, వారి ఐక్యతని విభజించాలి."

"అదెట్లా ?"

"రామయ్యను అవమానించినందు వల్ల కదా, యీ అసంతృప్తి ఏర్పడి, తత్ఫలితంగా మిమ్మల్ని యెదిరించాలన్న

ప్రయత్నం సాగుతోంది! అటువంటప్పుడు, వాణ్ని ఒక్కణ్ణీ చేతిలో పెట్టుకుంటే చాలు....వాళ్ళల్లో విభేదాలు తప్పకుండా వచ్చి తీరుతాయి. అక్కడితో సమస్య పరిష్కారమౌతుంది."

వెంకటరెడ్డి మొహం వికసించింది. శేఖరం సలహా అద్భుతంగా ఉన్నట్టు తోచింది.

"బ్రహ్మాండమైన ఆలోచన వచ్చిందోయ్ నీకు. అందుకేకదూ, నువ్వంటే నాకు వల్లమాలిన అభిమానం. అయితే, వాణ్ని యెలా చేతిలో పెట్టుకోమంటావు?"

శేఖరం, మెల్లగా నవ్వేడు.

"ఏముందండీ! గంగయ్య ఉన్నాడుగా! ఒక విధంగా చూస్తే, వాడూ ఒక నాయకుడే. ప్రత్యేకంగా వాణ్ని పిల్చి, రామయ్యను మీ వద్దకు పంపించమని చెప్పండి. రామయ్య, యెందుకు పిల్చారో తెలుసుకోలేక, మీ గదిలోకి ఆవేశంతోనే అడుగుపెడతాడు. రామయ్య చేతిలో ఓ పాతికరూపాయలు పడేసి, జరిగింది మర్చిపోమని చెప్పండి. ఇక నించి మీకు నమ్మినబంటుగా వాడే ఉండాలని, కాస్తంత ఆకాశానికెత్తండి. దాంతో, వాడు పరమానంద భరితుడై, బైటికొచ్చేస్తాడు హుషారుగా. వాడిలో పేరుకుపోయిన ద్వేషం, డబ్బుచేతిలో పడిన క్షణంలోనే మంచుముక్కలా కరిగిపోయుంటుంది. గంగయ్య, మొదలుగాగల మిగతా కమతగాళ్ళ భావాలు యెట్లావుంటాయో, వేరే చెప్పవశసరం లేదు. ఎందుకు పిల్చారని, వాణ్ని నిలదీసి అడుగుతారు. కాని, రామయ్య నిజం చెప్పడు. మీ అభిమానం సంపాదించుకున్నాడని చెప్పటానికి వాడికి మొహం చెల్లదు. దాంతో, రామయ్యపట్ల అనుమానం మొలకెత్తుతుంది. అంతే! వాళ్ళల్లో విభజన వచ్చేస్తుంది. రామయ్య ఒక ముఠా తయారు చేసుకుంటాడు. వాళ్ళెప్పుడూ అలానేవుంటే, తిరుగుబాటు అన్న ప్రసక్తే ఉండదు."




వెంకటరెడ్డి, సంతోషంతో పుప్పొంగిపోయాడు. "అబ్బ! ఎంత చక్కని ప్లాను శేఖరం? అందుకే అంటారు, వుపాయంవుంటే, అపాయాన్ని తప్పించుకోవచ్చునని. రేపే యీ నాటకానికి నాందిగీతం పాడుదాం...." మురిసిపోతూ, అన్నాడు వెంకటరెడ్డి.

శేఖరం, తృప్తిగా నవ్వుకున్నాడు ఇంక. తమ పలుకుబడికి, యే విధమైన

అంతరాయం కలుగదనుకున్నాడు.

* * *

మధ్యాహ్నం రెండుగంటలు కావ వోంది. కాస్సేపు విశ్రాంతి తీసుకోవాలి చేరబడ్డాడేగాని, నిద్రపట్టలేదు. వెంకట రెడ్డికి. గంగయ్యను కేకవేశాడు.

గంగయ్య. రానే వచ్చాడు. వాడి మొహంలోకి చూశాడు రెడ్డి ఆ మొహం లో ఒక విధమైన యేహ్యాభావం అస్ప ష్టంగా అగుపిస్తోంది.

"ఏంబాబూ?" అన్నాడు గంగయ్య ఆ స్వరం కాస్తలో కటువుగా ధ్వనించ డం గుర్తించాడు వెంకటరెడ్డి.

"రామయ్యను ఓసారి యిలా రమ్మ నాలు."

"చిత్తం...." అంటూ గంగయ్య బైటికి వెళ్ళిపోయాడేగాని, అతడి మెదడులో ఆలోచనలు గింగురుపెట్టాయి రామయ్యనే ప్రత్యేకంగా పిలవడానికి కారణం యేవిటా అని, ఆలోచన సాగించాడు. వాడి వూహకి అందలేదు, కారణం యేవిటో.

"అయ్యగారు రమ్మంటున్నార్రా నిన్ను" అన్నాడు, రామయ్యదగ్గరికివెళ్ళి

"నన్నా!" రామయ్య ఆశ్చర్యపో యాడు. వెంకటరెడ్డి తనని లంపవేసిన ఘడియ యింకా గుర్తుంది అతడికి.

"ఔన్రా! ఏదో విశేషం వుండుంటా దిలే. ఎళ్ళు" గంగయ్య పురమాయిం చాడు.

రామయ్య, విసురుగా వెళ్ళాడు, వెం కటరెడ్డి వున్న గదిలోకి.

"పిల్చారా బాబూ?" అన్నాడు గం భీరంగా లోపల అడుగుపెడుతూనే.

మొహమెత్తిచూశాడు వెంకటరెడ్డి రామయ్య మొహం, బిగుసుకుపోయి వుంది. లోలోపల తనపై కక్షవుండివుం టుందన్న అభిప్రాయాన్ని స్థిరపర్చుకు న్నాడు. మెల్లగా మందహాసం చేశాడు.

రామయ్య, మొన్న నెప్పుడో లెంప కాయకొట్టానని, కోపంగా వుంది కదూ నామీద, ఏదో ఆ ఆవేశంలో చెయ్యి జారిందోయ్ మరేం అనుకోవద్దోయ్ నిజం చెప్పాలంటే, నువ్వంటేనే నాకు యెంతో అభిమానం, నమ్మకమూను. అందుకే, చొరవతీసుకున్నాను. అది నువ్వు అర్థం చేసుకోకండా కోపం తెచ్చుకుని వుంటావు. ఏం? అంతేకదూ! సరేలే: జరిగిందేదో జరిగింది. ఇదిగో, యీ పాతికరూపాయలు నీదగ్గరరుంచు పిల్లలకి బట్టలు కుట్టించు.... ఎవ్వరికీ చెప్పకేం...." అంటూ పాతికరూపా యిలు అందించాడు, వెంకటరెడ్డి.

పదిరూపాయిలు కాగితాలు రెండూ. ఓ అయిదు రూపాయల కాగితమూ కళ్ళ జూసేసరికి, రామయ్యకి కళ్ళుచెదిరినయ్ ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. పెళ్ళాం చెప్పడం గుర్తుకొచ్చింది. ఆ పైకం ఆతృత ఆశను పురిగొల్పింది ధైర్యాన్ని పెంపొందించింది. అయినా, తన తెలివితక్కువతనం కాపోతే అయ్య గారితో కయ్యం పెట్టుకోవడమేమిటి? ఆయన దయుంటేనేకదా. తమలాం టోళ్ళు బతకడం?.... అన్న ఆలోచన చప్పున అతనిలో మెదిలింది. అంత

వరకూ అతడిలో ప్రజ్వలిస్తున్న ప్రతీ కారవాంఛ, సూర్యరశ్మి తగిలిన వెన్న ముద్దలా కరిగిపోయింది. తననే నమ్మ కస్తునిగా భావిస్తున్నపుడు, ఆయనలోని ఆ అభిప్రాయాన్ని యెందుకు రూపు మాపడం?— అనుకున్నాడు.

ఆ పైకం అందుకున్నాడు.

"జేబులో పెట్టుకో ఎప్పుడేనా ఏదేనా అవసరముంటే, నన్నడుగు.... బిడియ పడకు అన్నాడు మళ్ళీ. వెంకటరెడ్డి.

వెంకటరెడ్డి అభిమానానికి, ముగ్ధుడయ్యాడు, రామయ్యా.

"చిత్తం బాబూ" రామయ్యా కళ్ళు, కృతజ్ఞతతో చూశాయి రెడ్డికేసి. బనీను జేబులో డబ్బు పెట్టేసుకుని, బైటికి వచ్చేశాడు.

వెంకటరెడ్డి. తృప్తిగ నవ్వుకున్నాడు అతనికి అర్థమైపోయింది. రామయ్యా యింక మారడని శేఖరం చెప్పింది. అక్షరాలా నిజమైనందుకు, అతణ్ణి మనసులో అభినందించుకున్నాడు.

రామయ్యా బైటికి వచ్చేసరికి. గంగయ్యా కాస్తంత దూరంలో కనిపించాడు.

"ఎందుకు పిల్చార్రా అయ్యగారు?" మనసులోని ఆరాటాన్ని అరికట్టలేక, అడిగేశాడు గంగయ్యా.

నిజం చెప్పదల్చుకోలేదు. రామయ్యా "తోటలో మామిడికాయలు దించడానికి యేర్పాట్లు సెయ్యమన్నార్రా!" అన్నాడు యేదో ఒకటి చెప్పాలి గనుక.

గంగయ్యా ఆశ్చర్యపోయాడు. ముందురోజే అయ్యగారు తనతో ఆ విషయం చెప్పారు కాని. మళ్లీ వీడితో చెప్పడమేవిటా అని అతడి ఆశ్చర్యం.

"అబద్దం నిన్ననాతోటి సెప్పినారే ఆ యిసయం...." అనుమానంగా అన్నాడు. గంగయ్యా.

రామయ్యా. గతుక్కుమన్నాడు. అయినా బైటపడలేదు. చిరుకోపం, అతడి మొహంలోని రంగును మార్చింది అసలు. గంగయ్యకి యీ విషయాలన్నీ యెందుకా అనిపించింది కూడా.

"ఏమో, నాతోనూ సెప్పినారు. నువ్వు నమ్మకపోతే, యేంజేసేది?" అంటూ, చరచరా అక్కణ్ణించి జారుకున్నాడు, రామయ్యా.

గంగయ్యా, అనుమానాస్పదంగా రామయ్యాకేసిచూస్తూ క్షణం అక్కడే నుంచుండిపోయాడు. రామయ్యా నిజం చెబుతున్నట్టు నమ్మకం. కుదరలేదు. వాణ్ణి అవమానించినందుకు, తామందరూ యేకమై. అయ్యగార్ని యెదిరించాలని ఒప్పందం కుదుర్చుకుంటే యిప్పుడేమో యెదవ కొయ్యగారితో సేయి కలుపుతున్నాడు. ఛీ! యీడితో జాగర్తగ వుండాలే మరి: అనుకున్న గంగయ్యకి, కోపం వుదృతంగా పొంగి వచ్చింది. అక్కణ్ణించి విసురుగా వెళ్ళిపోయాడు.

అంతే! ఆరోజునించీ వాళ్ళల్లో విభజన వచ్చేసింది. ఎదిరించాలన్న కమతగాళ్ళ నిర్ణయం, మొగ్గలోనేతుంచి వేసినట్టయ్యింది. ★